# "సబద్ధం"

మనప్రవృత్తులు విచిత్రాలు. అబద్ధాన్ని నమ్మినంత తేలిగ్గా ఒక్కోసారి నిజాన్నిగూడా నమ్మం. ఏం చేస్తాంలే? "నమ్మలేక పోతున్నామే" అని విచారిద్దాం.

మీలో చాలామంది బొంబాయి వెళ్ళుంటారు. వెళ్ళిన వాళ్ళు "గేట్ వే ఆఫ్ ఇండియా" "హాంగింగ్ గార్డెన్స్" తప్పకుండా చూచి వుంటారు.

"గేట్ వే ఆఫ్ ఇండియా" హిందూదేశపు సింహద్వారం. ఈ సింహద్వారాన్ని మూసేందుకూ వీల్లేదు, తెరచెందుకూ వీలుకాదు. ఇష్టంవచ్చినవాళ్ళు లేనివాళ్లు రావచ్చు, పోవొచ్చు నిరభ్యంతరంగా. ఇల్లాంటి తలుపుల్లేని సింహద్వారాలు యింకెక్కడైనా వున్నవా? "ఆరగాన్"ని అడగండి చెబుతాడు.

హాంగింగ్ గార్డెన్! మలబార్ హిల్లాంటి పునాదున్న తోటని త్రిశంకుడి తోట అని యెట్లా అనగలం? ఐనా అంటున్నాం. మన ప్రవృత్తులు విచిత్రాలు కాదూ మరి?

ఇట్లాంటిదే యింకో విచిత్రంగూడా వుంది. ఆ బొంబాయిలో మీరు చూడలేదు కాబట్టి "లేదు" అనేందుకు మీకు హక్కుందో, లేదో, మీరే ఆలోచించుకోండి.

ఇది చౌపాతీకీ మెరైన్ డ్రైవ్ కీ సరిహద్దులలో వుంది. మీరు హిందూ స్విమ్మింగ్ పూల్ చూచే వుంటారు. ఇది కూడా దానికి దరిదాపులలోనే వుంది. ఇది ఒక క్లబ్...

ఈ క్లబ్బులో యిష్టంవచ్చినవాళ్లు వున్నవాళ్లు ఎవ్వరైనా సరే మెంబరుగా చేరవచ్చు. ఇట్లాంటి అవకాశాలందించే క్లబ్బులు బొంబాయిలో చాలా అరుదు. అయితే ప్రతి మెంబరు క్లబ్ నియమావళిని పూర్తిగా చదివి అవగాహన చేసుకుని తు. చ. తప్పకుండా అవలంబించగలం అనే నమ్మకం కలిగిం తర్వాతనే చేరటం శ్రేయస్కరం అందరికీనీ.

క్లబ్బులో చేరదలచుకున్న ప్రతివ్యక్తీ అబద్ధం ఆడగలిగి వుండాలి. అందులోనూ నిరాటంకంగా, నిరభ్యంతరంగా, గుక్క విడువకుండా, కుడి ఎడమలు ఆలోచించకుండా, పచ్చి అబద్ధం మంచినీళ్ళు త్రాగినట్లుగా వుండాలి. ఆ అబద్ధం అప్పీలుచేసినా తిరుగు లేనంత దిట్టంగానూ, దట్టంగానూ వుండాలి.

క్లబ్బులో చేరిం తర్వాత మెంబరు చెప్పిన ప్రతినిజానికీ, మాటకు పది రూపాయల చొప్పున జరిమానా చెల్లించేందుకు సిద్ధపడాలి.

చందా నెలకు నాలుగు రూపాయలు. నోట్లు చెల్లవు. విక్టోరియా రాణీ రూపాయలకు విలువ యెక్కువ. వెన్న వ్యాపారం చేసేవాళ్లు సొరకాయలు అమ్మేవాళ్ళు, పెరుగు వర్తకం చేసేవాళ్ళు రెండు రూపాయలు తక్కువ చెల్లించినా అభ్యంతరంలేదు.

అయితే పార్లమెంటు మెంబర్లకూ, అధికారంలోవున్న మంత్రులకూ, మెంబర్లయ్యే అవకాశంలేదు ఈ క్లబ్బులో. కారణం యిది ప్రభుత్వ వ్యతిరేక సంస్థ కావటంవల్లకాదు. నూ నూగు మీసాలకి, అబద్ధాలకీవున్న భేదం పాటించని మనుష్యులకి ఎక్కువ అవకాశం యివ్వడం క్లబ్ ఆశయం. కాబట్టి యీ వ్యవహారంలోవున్న తల కాస్తా ముగ్గుబుట్టగా తయారు చేసుకున్న "పెద్ద మనుష్యులకి" యిందులో చేరాల్సిన అవసరంలేదని అనుకోవటం చేతా, ఆ అవకాశాన్ని తగ్గించటమైంది. అదీగాక యిది సామాన్యులైన మనుష్యులకోసమే వుద్దేశింపబడింది కాబట్టి సామాన్యులు కాని మాన్యులు తమంతట తామే విరమించుకుంటారనే గాఢవిశ్వాసంగూడా వుంది క్లబ్ మెంబర్లకి.

నాకు కూడా దురదపుట్టింది. అందుకనే కురిసే వర్షాన్నికూడా లెక్కచెయ్యకుండా బయలుదేరాను క్లబ్‌కి. గేటు దగ్గర గూర్ఖా వున్నాడు.

"నేనూ మెంబర్నే" అన్నాను.

"మే మీ ముఖం యెప్పుడూ చూడలేదే" అన్నాడు వాడు.

"అబద్ధం ఆడకు. దేవు డున్నాడు పైన" అన్నాన్నేను.

వాడు గబగబా క్లబ్‌లోకి పరుగెత్తాడు. నేను వాడి వెనకే నడుస్తూ వరండాలో అడుగుపెట్టాను. ఇంతలో గూర్ఖా మరో పెద్దమనిషీ నా కెదురయ్యారు. ఆయన వాలకం

చూస్తే కార్యదర్శిలాగా వున్నాడు. "మీరేనా కార్యదర్శి?" అని ఆయన్ని అడక్కముందే, "మీ పేరు?" అనిఆయనే నన్నడిగాడు.

"పటేలు" అన్నాను నేను.

"రక్తరహిత విప్లవం తెచ్చింది మీరేనా?" అని అడిగాడు ఆ కార్యదర్శి. ఆయన కార్యదర్శనని తర్వాత రూఢయింది. "ఛ! నేను కాందే"నన్నాను.

ఇంతలో యింతవరకూ తలుపుచాటున నిలబడి వింటూన్న యిద్దరు మెంబర్లు మరింత ముందుకు వచ్చారు. కార్యదర్శి "శ్రీ పటేలు!" అని నన్ను పరిచయం చేశారు.

"అయితే మీరేం చేస్తారండీ?"అని అడిగారు కొత్తగా వచ్చినవాళ్ళల్లో ఒక పెద్దమనిషి.

"చూశారూ! యుద్ధం వద్దనేవాళ్ళు వొట్టి బద్ధకస్తులండీ. ముందు వాళ్ళతో యుద్ధం చేస్తాను. శాంతి కావాలనేవాడి రక్తంలో కాంతి లేదనే నా దృఢవిశ్వాసం. ఇది బుజూ చేసేందుకు వాడి రక్తం కళ్ళజూస్తాను. నా మాట వినేవాళ్ళకి "కోకో కోలా" యిప్పిస్తాను విననివాళ్ళకి..." అంటూ అవిరళధారగా మాట్లాడబోతుంటే మరో పెద్దమనిషి "సంతోషం! సంతోషం!" అని చంకలు కొట్టుకుంటూ, "మీకు బంధువులున్నారా అండి?" అని అడిగాడు. (ఈయన డబ్బున్నవాడు అయ్యాగూడ "నిక్కీ వుక్కూ నేడ, చూపించకుండా కష్టచేసేవారిలా సామాన్యుడిలా చంకలు కొట్టుకోవటం మొదలైన క్రింది తరగతుల అలవాటుల్ని

అభినయం చెయ్యడం గర్వకారణంగా భావించేవాడు కావటం చేత "డెమోక్రాట్" అనే గౌరవ వాచకాన్ని స్వార్జితం చేసుకున్నాడని కార్యదర్శి నాకు తెలియచెప్పాడు తర్వాత)

ఓ! లేకేం! కావలసినంతమందున్నారన్నాను. మా బంధువుల్లో ఒకరు అహ్మదాబాద్ మిల్లు యజమానుల సంఘాధ్యక్షుడన్నాను. మా మామగారు నాలుగైదు పత్రికల గొలుసులుకి మానేజింగ్ సంపాదకుడన్నాను. మా ఆవిడ అఖిలభారత భార్యల సంఘాధ్యక్ష పదవికి పోటీ చెయ్యదలచుకున్నదని కూడా అన్నాను.

"చేస్తున్నారా?" అని అడిగాడు కార్యదర్శి కళ్ళలో "ప్రాణం పెట్టుకుని దురదృష్టవశాత్తూ ఆవిడకా అదృష్టమూ, అవకాశమూ చిక్కలేదు. నేను రోజూ రాత్రిళ్ళు యింటికి ఆలస్యంగా రావటం చూచి, నా నిద్రలేమికి జాలి తలచి ఒక శుభోదయాన వారం వర్జ్యం చూచి, విషం త్రాగి, చనిపోయింద"ని అన్నాను.

నా ముందున్న పెద్దమనుష్యుల ముఖాల్లో సంతృప్తి కనిపించింది. ఇంతవరకూ నాక్కనిపించకుండా, క్లబ్‌లో విండ్ స్క్రీన్ వెనక కూర్చున్న ఐదారుగురు పెద్దమనుష్యులు మా ముందుకొచ్చారు. మెంబర్లందరూ నావంక కళ్లార్చకుండా చూచారు. నాకు చెమటలు పోయలేదు. నేనంటే నాకే విశ్వాసం నా జీవితంలో మొట్టమొదటిసారిగా యేర్పడబోతుందేమోనన్నంత సందేహం కలిగింది నాకు జేబులోంచి హాంకీ (రుమాలు) బయటికి తీశాను.

"మీరు ట్రూమన్‌గారి పేరు వినే వుంటారు?" అన్నాడు కొత్తగా వచ్చిన పెద్దమనుషుల్లో ఒకాయన.

"రెడ్ జివే యెవరో మీకు తెలుసు" అన్నాడు ఇందాకటి డెమొక్రాట్.

"అయ్యో! వాళ్ళు తెలియకపోవటమేమిటండీ ఖర్మ! మెకార్థర్ కూడా తెలుసు!" అన్నానేను.

"వారిని గురించి మీ అమూల్యాభిప్రాయం అని నీళ్లు నమలబోయాడు కార్యదర్శి. ఆయన నీళ్లు నమలటం చూస్తే మా నూడి పడ్డ నెమరు వేయటం గుర్తుకొచ్చింది నాకు. నాకేమీ బాగుండలేదు.

"అంతకంటేనా?" అన్నానో లేదో అందరూ నావంక ఆతుర్తతో చూచారు ముత్యపుచిప్పల్లా. నేను ప్రారంభించాను.

వాళ్ళందరికీ శాంతి అంటే వున్న అనురక్తి అనిర్వచనీయం. అయినా వాళ్ళాసంగతి రోజుకొక్కసారి గూడ బహిరంగం చెయ్యరు. బీదదేశాల కడిగినంత భిక్ష పెడతారు. అడగని దేశం పాపాత్మురాలు! వాళ్ళకి యుద్ధం అంటే అసహ్యం; శాంతి అంటే చచ్చేంత ప్రేమ! ఈ విషయం వారి ఆకాశవాణి రోజుకొక్కసారైనా గుక్కవిడవకుండా చెబుతుంది. మీకందరకూ తెలుసు. వాళ్ళ చేతుల్లో ఆటంబాంబుందని; అయినా వారింతవరకూ దాన్ని ఉపయోగించేందుకు తిరస్కరించారు. భవిష్యత్తులో గూడ అట్లా చేస్తారనుకునేందుకు అవకాశం సున్న. లోకం చస్తూంటే చూడలేని శ్రమ

జీవులు వాళ్ళు. వాళ్ళకి నరులంటే కనికరం మిన్న. అంచేత నే నరులు చేసే పనులు వానరుల్తో చేయించబోతున్నారు. వాళ్ళ దేశం భూతలస్వర్గం. వాళ్ళు పూజ్యులు. కుబేరులు; నానా విధ సంపన్నులు...

తర్వాత నా మాటలు నాకే విన్పించలేదు. నా గద్గద కంఠం వాళ్ళ చప్పట్ల అడుగులకి మడుగులొత్తబోయింది. నేను నా ఆవేశతరంగాల్ని వెనక్కి నెట్టేప్పటికి మెంబర్లందరూ నా చుట్టూ మూగి నన్ను "అప్పాచ్చి" చేతుల్తో పైకెత్తి జయజయధ్వానాలు చేస్తున్నారు. నాకు కళ్ళంట నీళ్లు గిర్ర్రున తిరిగాయి.

నేనంటే కన్వరచిన యీ అభూత అపాయానికి ధన్య వాదాలర్పించుదామనుకుంటూండగానే "హిందూ స్విమ్మింగ్ పూల్లో జరిగిన యీతల పోటీల్లో ప్రథమ బహుమానం పొం దింది మీరే గదూ;" అని సాదరించాడు ఒక పెద్దమనిషి.

"అయ్యో! నేను కాదండీ" అని తేరుకొని, "మా పెద్దన్నయ్యండీ ఆయన" అని నిలదొక్కుకొన్నాను.

"ఓహో, చిరంజీవి తమ్ముడు" అని నలిపి, గుచ్చి పైకెత్తాడు డెమొక్రాట్.

మెంబర్లందరూ నేనుగూడ మెంబర్నయ్యేందుకు అర్హు డ్ణేనని ఏకగ్రీవంగా అంగీకరించారు.

ఇంతవరకూ ఆ మెంబర్లలో యెవ్వరూ కనీ వినీ యెరు గని విధంగా ప్రవేశం సంపాయించినందుకు మెచ్చుకుంటూ నా

చందాని రద్దుచేశారు, సర్వసాధారణ సమావేశంలో ఏక గ్రీవంగా.

ఇదంతా సబద్ధంకాని అబద్ధం అని మీరంటే లేని విచిత్రం మన ప్రవృత్తులు విచిత్రాలని నేనంటే యెక్కడినుండీ పుట్టుకొస్తుందో మీరే చెప్పండి!

వినేందుకు నేను సర్వసిద్ధంగా వుండనే వున్నాను.

—:o:—